3,12,733



- గాజువాకలో మొత్తం ఓటర్ల సంఖ్య
- తొలగించిన ఓట్లు : 33,791

గాజువాక: గాజువాక నియోజకవర్గంలో ఓటర్ల జాబితాల ప్రక్షాళన ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చింది. ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల అనంతరం నియోజకవర్గంలో ఎంతమంది ఓటర్లున్నారన్న విషయంపై అధికారులు తాజా జాబితాలను తయారు చేశారు. ప్రస్తుత జాబితాల ప్రకారం నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 3,12,733 మంది. అందులో పురుషులు 1,58,231 కాగా, మహిళలు 1,54,486 మంది. మరో 16 మంది ట్రాన్స్‌జెండర్లు.

ఓటర్ల జాబితాల ప్రక్షాళన ప్రక్రియను గతేడాది జనవరి 6న ప్రారంభించి ఈ ఏడాది జూలై 31 వరకు కొనసాగించిన విషయం తెలిసిందే. కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఏడాదిన్నరకు పైగా ఓటర్ల జాబితాలపై సంబంధిత సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. ఇక్కడి ఓటర్లలో శాశ్వతంగా వలస వెళ్లినవారికి ఫారం బీ నోటీసులు, డబుల్ ఎంట్రీ ఓటర్లకు ఫారం ఏ నోటీసులను జారీ చేశారు. మృతి చెందిన వారిని గుర్తించి తొలుత 34,256 మంది ఓట్లను జాబితాల నుంచి తొలగించిన అధికారులు వాటిపై అభ్యంతరాలను కూడా స్వీకరించారు. ఈ విషయంపై ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీ నాయకులతో సమావేశమై వారి నుంచి సలహాలను స్వీకరించారు. ఈ నేపథ్యంలో అందిన పలు అభ్యంతరాలను పరిశీలించిన అధికారులు తొలగించిన ఓట్లలో 456 ఓట్లను పొరపాటున తొలగించినట్టు గుర్తించి వాటిని పునరుద్ధరించారు. అనంతరం గాజువాక ఓటర్ల సంఖ్య 3,12,733 మందిగా గాజువాక ఓటర్ల నమోదు అధికారి డి.లక్ష్మారెడ్డి తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో లక్ష్మారెడ్డి

కొత్త ఓటర్ల నమోదుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

కొత్తగా ఓటు నమోదు చేసుకోదలచిన వారికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 15 తరువాత సంబంధిత వెబ్‌సైట్‌ను కొద్దికాలం పాటు ఆపుతారు. అక్టోబర్ నుంచి మళ్లీ యథావిధిగా ఓటర్ల నమోదు ఉంటుందని చెబుతున్నారు.

రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

ఈఆర్వో లక్ష్మారెడ్డి వివిధ రాజకీయ పార్టీల నాయకులు, బీఎల్వోలు, సిబ్బందితో మంగళవారం సమావేశమయ్యారు. ఓటర్ల జాబితా ప్రక్షాళన, కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించిన వివరాలను నాయకులకు వివరించారు. సమావేశంలో గాజువాక, పెదగంట్యాడ తహసీల్దార్లు పాల్ కిరణ్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నడకతో ఆరోగ్య సంరక్షణ



నడక వల్ల ప్రయోజనాలను వివరిస్తున్న శుభ

గాజువాక: ప్రతి రోజు నడవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ ఉప్పలపాటి శుభ అన్నారు. నడక ప్రయోజనాలపై స్థానిక అమరావతి పార్కులో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతిరోజు కనీసం అరగంట నడవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయన్నారు. వాకర్స్‌తో తమ వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థను కూడా బలోపేతం చేస్తున్నామన్నారు. విశాఖ జిల్లాలో ఇప్పటివరకు 135 వాకర్స్ అసోసియేషన్లు ఉన్నాయని తెలిపారు. నడవండి.. నడిపించండి.. ఆరోగ్యమే మహాభాగ్యం అనేవి తమ సంస్థ ఆశయాలన్నారు. ప్రస్తుతం పది జిల్లాల్లో తమ సంస్థలు 1500 ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సంస్థ అమరావతి నగర్ కమిటీ ప్రతినిధులు ఎం.ఎల్.కె.ఎస్.అచ్యుతరావు, పైలా కృష్ణారావు, బి.వి.దుర్గా ప్రసాద్, ఎం.రమేష్ నాయుడు, బలివాడ సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు పరిశ్రమను ప్రైవేట్‌పరం కానివ్వం'



దీక్షలో పాల్గొన్న కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న నాయకుడు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్మాలనే దుర్మార్గపు ఆలోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 943వ రోజు, మంగళవారం సంస్థలోని వివిధ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ప్రజల సంపదైన స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడం కోసం దేశ వ్యాప్త ఉద్యమాలకు సిద్ధమన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ శక్తులకు కట్టబెడితే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లోనైనా విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తామనే ప్రకటన చేయాలని, లేనిపక్షంలో తమ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

14న మండల స్థాయి క్రీడా పోటీలు

అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు, మండల కన్వీనర్ లోవరాజు తెలిపారు. జీవీఎంసీ 79వ వార్డు లంకెలపాలెం హైస్కూల్‌లో ఉదయం 8 గంటల నుంచి బాలురు, బాలికల విభాగంలో అండర్ 14, 17 కేటగిరీల్లో పోటీలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, త్రోబాల్, టెన్నీకాయిట్, యోగాతో పాటు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు.

పేదలకు చీరల పంపిణీ



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: కార్మిక నాయకుడు పులి అప్పలరెడ్డి సేవలు మరువలేమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. పులి అప్పలరెడ్డి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. అప్పలరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయ్, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, పులి వెంకట రమణారెడ్డి, మద్ది శంకరరెడ్డి, మహేశ్వరరెడ్డి, దొమ్మేటి అప్పారావు, అప్పలరెడ్డి, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

రీసెర్చ్ ప్రాజెక్టు రిపోర్టుల విడుదల



ప్రాజెక్ట్ రిపోర్టులను విడుదల చేస్తున్న వీసీ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన నాలుగు పరిశోధన ప్రాజెక్టుల రిపోర్టులను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి మంగళవారం తన కార్యాలయంలో విడుదల చేశారు. యూజీసీ సహకారంతో 2022-23 మధ్య కాలంలో పరిశ్రమలు, రిటైల్ షాపుల్లో పని చేస్తున్న మహిళల ఆరోగ్య సమస్యలు, పట్టణ మురికివాడల్లో మహిళల ఆరోగ్య సమస్యలపై అధ్యయనం చేశారు. అదే విధంగా పని చేసే స్థలంలో లైంగిక వేధింపుల నిరోధంపై అవగాహనకు నిర్వహించిన యాక్షన్ రీసెర్చ్ రిపోర్ట్‌లను వీసీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, మహిళా అధ్యయన కేంద్రం సంచాలకులు డాక్టర్ పి.ఉష, సిబ్బంది డాక్టర్ టి.సాంబశివరావు, డాక్టర్ కె.రవికుమార్, బి.జె.కిరణ్ ప్రసాద్, సిహెచ్.ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు.

27వ రోజుకి శ్రావణలక్ష్మి పూజలు

కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు మంగళవారం 27వ రోజుకి చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

అసంపూర్తిగా నిర్మాణం



అక్కిరెడ్డిపాలెంలో నిర్మించిన షెడ్డు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం గ్రామ శివారులో ధోబీఖానా పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. కేవలం షెడ్డు మాత్రం నిర్మించారని, మిగిలిన సదుపాయాలు కూడా కల్పించాలని రజక సంఘాలు కోరుతున్నాయి. గ్రామంలో ధోబీఖానా నిర్మిస్తే సుమారు 15 కుటుంబాలు జీవనోపాధి పొందుతాయని చెబుతున్నారు. షెడ్డు నిర్మించినా.. నీళ్లకుండీలు, బల్లలు, విద్యుత్ మోటార్లు, బావి వంటివి ఏర్పాటు చేయకపోవడంతో అలంకారప్రాయంగానే మిగిలింది. దీంతో మందుబాబులు చేరి ఆ ప్రాంతాన్ని మందు సీసాలు, ప్లాస్టిక్ గ్లాసులతో నింపేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెత్త, డెబ్రిస్ కూడా వేయడంతో ఆ ప్రాంతం అస్తవ్యస్తంగా మారిందని రజకసంఘం పెద్దలు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రజకుల జీవనోపాధికి అవసరమైన పనులు సత్వరం ప్రారంభించి, ధోబీఖానాను అందుబాటులోకి తేవాలని రజక సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

కొత్త పెన్షన్ల పంపిణీ నేడు



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ వంశీరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని టీజీఆర్ నగర్, దల్లివానిపాలెం సచివాలయ పరిధిలో కొత్తగా మంజూరైన పెన్షన్లను బుధవారం పంపిణీ చేయనున్నామని ఆ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి తెలిపారు. దల్లివానిపాలెం సచివాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో కొంతమందికి పెన్షన్లు పంపిణీ చేశామన్నారు. మిగిలిన వారికి బుధవారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందిస్తున్నామన్నారు. సమావేశంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'విస్టా' వర్క్‌షాపు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విజ్ఞాన్ రెక్టార్ మధుసూదనరావు తదితరులు

అగనంపూడి: ఇంజినీర్స్ డే సందర్భంగా ఈ నెల 14వ తేదీ నుంచి రెండు రోజుల పాటు దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ సాంకేతిక సదస్సును నిర్వహిస్తున్నట్లు కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ జె.సుధాకర్ తెలిపారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో సాంకేతిక సదస్సు విస్టా (విజ్ఞాన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) -2023 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని రెండు రోజుల పాటు 'సస్టెయినబుల్ టెక్నాలజీస్' పై ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన అంశాలను రెండు రోజుల ప్రదర్శనలో ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. దేశంలోని వివిధ యూనివర్సిటీలు, ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొని సమాజానికి హితం చేకూర్చే ప్రదర్శనలు, లైవ్ ఎగ్జిబిషన్ల నిర్వహణ, టెక్నికల్ వర్క్‌షాపులు, పోస్టర్ ప్రజంటేషన్లు, 2డీ, 3డీ ప్రింటింగ్ మోడళ్లు, కోడింగ్ వంటివి ప్రదర్శిస్తారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవీంద్ర, కన్వీనర్ బోడే ప్రసాద్, కో-కన్వీనర్ పద్మాకర్, వివిధ విభాగాల డీన్లు, స్టూడెంట్స్ కన్వీనర్లు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న స్టీల్‌ప్లాంట్ జీఎం రంగనాథ్

ఉక్కునగరం: స్థానిక విశాఖ విమల విద్యాలయంలో మదర్ థెరిసా జయంతి ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. స్నేహ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులు వివిధ అంశాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. స్టీల్‌ప్లాంట్ మైన్స్ జీఎం బి.రంగనాథ్ ముఖ్య అతిథిగా హాజరై మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. అనంతరం పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. గత 25 ఏళ్ల నుంచి జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్న ట్రస్ట్ చైర్మన్ ఎస్. సత్యనారాయణను సత్కరించారు. కార్యక్రమంలో విమల విద్యాలయం ప్రిన్సిపాల్ సిస్టర్ లాన్సీ, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ అరుణ, ఎస్.ఉమామహేశ్వరరావు, బలిరెడ్డి సత్యనారాయణ, డి.మధుసూదనరావు, రవి దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

16న లలితాపీఠంలో అష్టావధానం

సీతంపేట: లలితానగర్ శ్రీలలితాపీఠంలో ఈ నెల 16, 17 తేదీల్లో కవితా మహేంద్రజాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. 16వ తేదీ సాయంత్రం 6 గంటలకు అష్టావధానం జరుగుతుందని డాక్టర్ కడిమిళ్ల వరప్రసాద్ సంచాలకులుగా, శతావధాని బులుసు అపర్ణ, పలువురు సాహితీవేత్తలు పాల్గొంటారని తెలిపారు. 17న సాయంత్రం 6 గంటలకు తెలుగు విజయం సాహితీ రూపకం ప్రదర్శించబడుతుందన్నారు.

16 నుంచి మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సమ్మె



సమావేశంలో మాట్లాడుతున్న కార్యదర్శి రాజు

గాజువాక: తమ సమస్యల పరిష్కారంపై జీవీఎంసీ ఉన్నతాధికారులతో కుదిరిన ఒప్పందాన్ని అమలు చేయని కారణంగా ఈ నెల 16 నుంచి మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు సమ్మెకు దిగుతున్నట్టు జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు తెలిపారు. గాజువాక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన యూనియన్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. నీటి సరఫరా, యూజీడీ, వెటర్నరీ, మలేరియా, పారిశుధ్యం, క్లాప్ డ్రైవర్లుగా పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను గత నెల 31లోగా పరిష్కరిస్తామంటూ ఉన్నతాధికారులు ఈ ఏడాది జూన్ 16న జరిగిన చర్చల్లో అంగీకరించారన్నారు. అయినప్పటికీ పరిష్కారానికి ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. వారసత్వ పోస్టుల భర్తీ, జీవో ప్రకారం వేతనాల అమలు, హెల్త్ అలవెన్సులు, సిబ్బంది పెంపు తదితర అంశాలపై జరిగిన ఒప్పందాన్ని అమలు చేసేవరకు తమ పోరాటం ఆగదని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు గొలగాని అప్పారావు, రాము, గణేష్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మల్లయ్య

ఉక్కునగరం: ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.తౌడన్న, బయ్యే మల్లయ్య అన్నారు. స్థానిక స్టీల్‌క్లబ్ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన సంఘం 11వ సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. గతేడాది కాలంలో చేసిన కార్యక్రమాలను వివరించారు. సంఘం సభ్యత్వ రుసుం, పదవీ విరమణ ప్రయోజనం పెంచేందుకు సమావేశం ఆమోదం తెలిపింది. నిర్మాణంలో ఉన్న బుద్ధ విహార్ పూర్తి చేయడానికి కార్మికుల నుంచి రూ. 300, అధికారుల నుంచి రూ.500 ఇచ్చేందుకు సమావేశం అంగీకరించింది. కార్యక్రమంలో బుద్ధవిహార్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కపార్థే, పరమట సత్యనారాయణ, అసోసియేషన్ నాయకులు ఎల్.వి.రమణ, ఎస్.సత్యనారాయణ, కె.వి.రత్నం, మోహన్‌బాబు, పుల్లారావు, గణేష్, ఫణీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ చైతన్యానికి కృషి అవసరం

- రెక్టార్ ఆచార్య కె.సమత
- ఏయూలో ఐడీఆర్‌సీ తరగతుల ప్రారంభం



మాట్లాడుతున్న రెక్టార్ ఆచార్య కె.సమత

ఏయూ క్యాంపస్: విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యం పెంచే దిశగా అధ్యాపకులు కృషి చేయాల్సిన అవసరం ఉందని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. మంగళవారం ఏయూ హెచ్‌ఆర్‌డీసీ కేంద్రంలో నిర్వహిస్తున్న పర్యావరణ శాస్త్రంపై పునశ్చరణ తరగతులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా రెక్టార్ మాట్లాడుతూ ఇక్కడ నేర్చుకున్న నూతన జ్ఞానాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు.సృజనాత్మకత,సహనం, కమ్యూనికేషన్ స్కిల్స్, కాల నిర్వహణ, కాలానుగుణంగా మార్పులను ఆకళింపు చేసుకోవడం వంటి లక్షణాలను అధ్యాపకులు అలవాటు చేసుకోవాలన్నారు. పర్యావరణ మార్పులు పెను సవాళ్లను విసురుతున్నాయన్నారు. ఊహించని విధంగా వరదలు రావడం, ప్రత్యామ్నాయ ఇంధనాలను అన్వేషించడం ఎంతో అవసరమన్నారు. వాయు కాలుష్యం కారణంగా లక్షలాది మంది ప్రతి సంవత్సరం మృత్యువాత పడుతున్నారన్నారు. అనేక పర్యావరణ సంబంధ సమస్యలకు పరిష్కారాలను చూపే దిశగా ఆచార్యులు కృషి చేయాలన్నారు. యువతను తీర్చిదిద్దడంలో అధ్యాపకునికి సహనమే అతిపెద్ద ఆయుధంగా నిలుస్తుందన్నారు. ఏయూ హెచ్‌ఆర్‌డీసీ కేంద్రం సంచాలకుడు ఆచార్య వెంకటకృష్ణ మాట్లాడుతూ విభిన్న జీవులతో సమన్వయం చేసుకుంటూ సాగడం మానవ జీవన విధానమన్నారు. వైవిధ్య అంశాలు, శాస్త్రాల సమ్మేళనంగా పర్యావరణ శాస్త్రం నిలుస్తుందన్నారు. సదస్సు కన్వీనర్ ఆచార్య ఉదయ భాస్కరరెడ్డి, ఆచార్య ఎస్.ఎ.డి.పాల్, తదితరులు పాల్గొన్నారు.

మాంగనీసు లీజు గడువు పెంపునకు సహకరించండి



ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న సీ ప్రధాన కార్యదర్శి ప్రసాద్

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌కు ప్రస్తుతం ఉన్న గర్భాం మాంగనీసు లీజు గడువు పెంపునకు చర్యలు తీసుకోవాలని ఉక్కు అధికారుల సంఘం (సీ) అధ్యక్షులు కాటం చంద్రరావు, ప్రధాన కార్యదర్శి కె.వి.డి.ప్రసాద్ కోరారు. విశాఖ ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణను వారు కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్‌కు 40 ఏళ్ల క్రితం విజయనగరం జిల్లా గర్భాం గ్రామ పరిధిలో మాంగనీజు గనులు కేటాయించారన్నారు. దాని గడువు గత ఏడాది అక్టోబర్ 7వ తేదీతో ముగిసిందన్నారు. నిబంధనల ప్రకారం ఇంకో పది సంవత్సరాలు లీజు గడువు పెంపు కావాలని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం దరఖాస్తు చేసుకుందన్నారు. దురదృష్టవశాత్తు లీజు గడువు ఫైలు మైనింగ్ మంత్రిత్వశాఖ వద్ద పెండింగ్‌లో ఉందన్నారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం పెద్దలతో మాట్లాడి లీజు గడువు పెంపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎంపీ స్పందించి వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ పంపినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

అవగాహనతోనే.. అడ్డుకట్ట

ఎంత గొప్ప విషయమైనా మామూలుగా చెప్పే దాని కన్నా.. దృశ్య రూపంగా చెబితే చక్కటి ఫలితం ఉంటుంది. నాటకం, సినిమా, బుర్రకథ వంటి కళారూపాల ద్వారా సామాన్యులకు ఏదైనా చెబితే అది ఇట్టే గుర్తుండిపోతోంది. గతంలో ప్రభుత్వం సీజనల్ వ్యాధులపై ఇలాగే కళాజాతాలు నిర్వహించేది. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో మళ్లీ అలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తే మంచి ఫలితం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



ప్లాస్టిక్ నిషేధంపై వినూత్న ప్రచారం చేస్తున్న కళాకారులు (ఫైల్)

డాబాగార్డెన్స్ : మనిషన్నాక ఎప్పుడో ఒకప్పుడు అనారోగ్యం తప్పదు. పిల్లలకు ఈ సమస్యలు మరీ అధికం. పైగా జీవన ప్రమాణాలు కనిష్ట స్థాయిలో ఉండే చోట ఆరోగ్యం అంతంత మాత్రంగానే ఉంటుందనడంలో సందేహం లేదు. ఇలాంటి వ్యాధుల గురించి సామాన్యులు, పెద్దగా చదువుకోని ప్రజలకు అవగాహన అంతంత మాత్రమే. ఈ పరిస్థితుల్లో సంక్రమించే వ్యాధులను నిర్లక్ష్యం చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నది మనకు అవగతమే. అలా అని వారికి వ్యాధుల గురించి పాఠంలా వివరిస్తే ఫలితం ఉండదు. ఈ అంశాలన్నింటిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం స్థానికులకు వినోదాన్ని కలిగిస్తూనే అవగాహన పెంచే కళారూపాలను ఊరూరా పంపి, కార్యక్రమాలు నిర్వహింపజేసేది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సీజనల్ వ్యాధులపై ప్రతి ఏటా వివిధ రూపాల్లో ప్రజలకు అవగాహన కల్పించేది. దక్షిణ నియోజకవర్గంలోని పాతపోస్టాఫీస్, అల్లిపురం భీంనగర్, ప్రసాద్‌గార్డెన్స్, జ్ఞానాపురం తదితర ప్రాంతాల్లో ఉన్న పబ్లిక్ హెల్త్ సెంటర్ల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఆయా సెంటర్ల ఏఎన్‌ఎంలు, ఆయాల సహకారంతో సదస్సులు నిర్వహించేవారు. సదస్సులతో పాటు మురికివాడల్లోని ప్రజలకు మరింత చేరువ అయ్యేందుకు బుర్రకథల రూపంలో కళాకారులు సీజనల్‌గా వచ్చే వ్యాధులు, తీసుకోవల్సిన జాగ్రత్తలను పాట మాదిరిగానో, కథలాగానో చెప్పేవారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న మందులపై అవగాహన కల్పించడంతో పాటు పిల్లల్లో ఐదు రకాల వ్యాధులను నియంత్రించే పెంటావాలెంట్ వ్యాక్సిన్ ఉపయోగాలను సరదాగా వివరించేవారు. అన్నీ కథల్లా ఉండడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించేవారు. కొంత వరకైనా అవగాహనకు వచ్చేవారు. పేదసాద ప్రజలకు సీజనల్‌గా వస్తున్న వ్యాధుల గురించి అవగాహన కలిగించటం, ముందస్తు నివారణ పద్ధతులను విశదీకరించటంపై మళ్లీ దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుతం నగరంలో ఎక్కడ చూసినా విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. జనం జ్వరాలతో మంచం పడుతున్నారు. మురికివాడలతో పాటు పరిసరాల శుభ్రత, వ్యక్తిగత శుభ్రత లేకపోవడంతోనే వ్యాధులు వ్యాపిస్తాయన్న విషయాన్ని ప్రజలకు చెప్పడం ఎంతైనా అవసరం. దీనికి బుర్రకథ, వీధి నాటకాల ప్రక్రియను మళ్లీ ప్రారంభిస్తే ఫలితం ఉంటుందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

చర్యలు చేపడుతున్నాం..

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించే విషయమై చర్యలు చేపడుతున్నాం. ముఖ్యంగా మురికివాడ ప్రాంతాల్లో కళాజాతాలు, వివిధ రూపాల్లో అవగాహన కల్పించనున్నాం. సీజనల్ వ్యాధులు, అవి రాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై ప్రజలకు సులువుగా అర్థమయ్యే రీతిలో ఈ కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటాం. అందుకు సంబంధించి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం.

-పి. జగదీశ్వరరావు,
జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

కమనీయం.. అప్పన్న నిత్య కల్యాణం



యజ్ఞోపవీతం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటలకు ఆలయ బేడా మండపంలో వేదికపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుదీర్చారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.